16న జరిగే పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వచ్చే నెల 16న నిర్వహించనున్న అడ్వాన్స్ పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే నెల 18వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్ష కేంద్రం సమయాల్లో మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, ఏడు, ఎనిమిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 18: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్‌ఓఎం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడిఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నారాయణగూడ ఫీడర్ పరిధిలోని గౌరమ్మగల్లి, నెహ్రూనగర్, సూర్యనగర్, మానస ఎన్‌క్లేవ్, అరోరా డిగ్రీ కాలేజ్, బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిక్కడపల్లి, ఆర్‌ఓఎం ఫీడర్ల పరిధిలోని చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి టెంపుల్, ఉమా గార్డెన్, బాగ్‌లింగంపల్లి, టెన్ టీవీ, ఆర్టీసీ కల్యాణమండపం, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, రాజేంద్ర ఆయిల్ మిల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

నత్త నడకన బ్రిడ్జి నిర్మాణం

- అశోక్‌నగర్‌లో రెండేండ్లుగా కొనసాగుతున్న పనులు
- పనులు పూర్తయితే ప్రయాణికులకు తప్పనున్న తిప్పలు

కొనసాగుతున్న అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

ముషీరాబాద్, జూన్ 18: అశోక్‌నగర్–దోమలగూడ వంతెన నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. రెండు సంవత్సరాలు అవుతున్నా నిర్మాణ పనులు పూర్తి చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని చిక్కడపల్లి, దోమలగూడ మీదుగా లిబర్టీ వైపు వాహనాల రాకపోకల కోసం హుస్సేన్‌సాగర్ నాలా మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అయితే పనులు ప్రారంభించి రెండున్నర ఏండ్లు గడుస్తున్నా ఇంతవరకూ పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టలేకపోయారు. 2023 జూలై నుంచి నేటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. చిక్కడపల్లి నుంచి లిబర్టీ వైపు చేరుకునేందుకు అణువుగా హుస్సేన్‌సాగర్ నాలాపై రెండు వైపులా మార్గాలు ఉండేలా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇందిరా పార్క్ మార్గంలో (స్టీల్ బ్రిడ్జి) నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతూ ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గంగా దోమలగూడ–చిక్కడపల్లి మార్గాన్ని రూపొందిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే స్టీల్ బ్రిడ్జి ఇందిరాపార్కు మార్గంలో ట్రాఫిక్ జామ్ సమస్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఈ దిశగా 2023 జూన్‌లో అప్పటి బీఆర్ఎస్ సర్కారు బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించింది. ఇందులో భాగంగా హుస్సేన్‌సాగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. 48 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు రెండు లైన్ల కాలిబాట నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.6 కోట్ల నిధులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. తొలుత నాలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అధికారులు నీటిని మళ్లిస్తూ సాంకేతికతతో పనులు చేపట్టారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే చిక్కడపల్లి చందన బ్రదర్స్, అశోక్‌నగర్, ఏవీ కాలేజ్, గగన్‌మహల్ ప్రాంతాలకు ప్రయాణం సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సభ పోస్టర్ ఆవిష్కరణ

సంఘం 8వ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుర్రం పవన్‌కుమార్, తదితరులు

మారేడ్‌పల్లి, జూలై 18: ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుపతలపెట్టిన ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ మహాసభ పోస్టర్‌ను బుధవారం జూబ్లీబస్టాండ్ ఆవరణలో సంఘం హైదరాబాద్ జోన్ గౌరవ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు గుర్రం పవన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు అందరూ ఐక్యంగా సంఘటితం అయినప్పుడే హక్కులు సాధించుకోవడం సులభతరం అవుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ నెల 24న జరుగనున్న మహాసభకు తోటి ఉద్యోగులను తరలించడంలో నాయకులు ముందుండి బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆర్టీసీ ఎండీ హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీలో బీసీల సత్తా ఏమిటో నిరూపించుకునే సమయం ఆసన్నమైందన్నారు. నగరంలోని 24 బస్ డిపోలతో పాటు మిగితా రీజియన్ల నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, తిరుపతయ్య, వెంకటేష్, మాధర్, కృష్ణ, రేణుక, సృజన, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్, జూన్ 18: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు బుధవారం సమర్పించారు. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం దివ్యాంగుల సమస్యలను తెలియజేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, దివ్యాంగులకు అనుకూలంగా పబ్లిక్, గవర్నమెంట్ బిల్డింగ్ నిర్మించాలని, డబుల్ బెడ్రూమ్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. షరతులు లేకుండా పది లక్షలు లోన్ ఇవ్వాలని, అర్హులైన వికలాంగులందరికీ ఆరోగ్య బీమా ప్రత్యేక పథకాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు జంగిలి శ్రీనివాస్, పంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల హక్కుల వేదిక నాయకులు

పనులు ప్రారంభించండి

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేస్తున్న సితాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జూన్ 18: సమస్యలు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను సీతాఫల్మండి డివిజన్ కార్పొరేటర్ హేమ కలిసి విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని లేఖలో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని భవానినగర్ నుంచి మహ్మద్‌గూడ వరకు ఉన్న నాలా పునర్నిర్మాణ పనుల కోసం 2022 నవంబర్‌లో జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలోనే మంజూరు అయ్యాయని గుర్తుచేశారు. కానీ ఇప్పటి వరకు పనులు జరుగకపోవడం వల్ల పలు ప్రాంతాల నివాసితులకు అసౌకర్యంతో పాటు వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉందని వివరించారు. త్వరగా నాలా పనులు చేపట్టాలని విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండి మున్సిపల్ వార్డులో పలు అభివృద్ధి పనులను ప్రతిపాదించారని, ఇందుకు నిధులు సైతం మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వెంటనే ప్రారంభించేందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు.

రైల్వే జీఎంకు ఘనంగా వీడ్కోలు

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్, శంకర్‌రావు, నేతలు

మారేడ్‌పల్లి, జూన్ 18: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పదవి విరమణ వేడుకలు ఘనంగా జరిగాయి. జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీఎంను పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రైల్వే జీఎం మాట్లాడుతూ యూనియన్ నాయకులు వ్యక్తిగత పనుల కన్నా ఉద్యోగుల సంక్షేమం కోసం ఎక్కువగా పని చేశారని అన్నారు. కార్మికుల కోసం పని చేసే చరిత్ర ఉన్నది కాబట్టే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు తనకు ఆదర్శం అని అన్నారు. యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే జీఎంగా అరుణ్‌కుమార్ జైన్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రైల్వే ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారని, ఇండియన్ రైల్వేలో సికింద్రాబాద్ జోన్‌ను అగ్రగామిగా నిలిపారని తెలిపారు. రైల్వే ఉద్యోగుల సౌకర్యార్థం స్పెషల్ వార్డుల ఏర్పాటు, క్యాథలిక్ ల్యాబ్‌లు, 20 గెస్ట్ రూంల నిర్మాణం చేపట్టారని వెల్లడించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో సుమారు 15 వేలకు పైగా నూతన ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత రైల్వే జీఎంకే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ నీరాజ్ అగర్వాల్, జనరల్ మేనేజర్ సెక్రటరీ శ్రీనివాస్, ప్రిన్సిపల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బ్రీజ్ మోహన్ మీనా, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారామ్, ఆరోమా ఠాగూర్, యూనియన్ నాయకులు ఉదయభాస్కర్, రామకృష్ణ, సరోజినీరెడ్డి, రవీందర్, స్వామి పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం

శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత, డీసీ సుభాష్‌రావు

అడ్డగుట్ట, జూన్ 18: పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సూచించారు. మెట్టుగూడ డివిజన్లో మూడు రోజులపాటు జరిగిన శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుతో కలిసి స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మూడు రోజులపాటు శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగిందని, పరిసరాలను అన్ని విధాలుగా పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏఆర్ కృష్ణ, జీహెచ్ఎంసీ ఏఈ సదజా, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లో సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించే దిశగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బొల్లారంలోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కాలేజీలో కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్ ఫ్రాడ్స్, ఓటీపీ, బ్యాంక్ మోసాలు, పార్ట్‌టైమ్ జాబ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ట్రేడింగ్ స్కామ్స్, ఫేక్ లోన్ యాప్స్, సోషల్ మీడియా ట్రోలింగ్, స్కామ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నేరాలు ఎలా జరుగుతాయో వారికి సైబర్ టీమ్ ఇటీవల జరిగిన సంఘటనలు చెప్పి అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. వారి కుటుంబ సభ్యులకు కూడా సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యంతోపాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మార్పు

చిక్కడపల్లి, జూన్ 18: గోల్కొండ చౌరస్తా సమీపంలో ఉన్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను నారాయణగూడ మెట్రో పిల్లర్ 1177, నారాయణగూడ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌కు మార్చారు. ఇప్పటివరకు గోల్కొండ చౌరస్తాలో ఉన్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కొత్తగా ఏర్పడ్డ గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని మార్చారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్ ఏసీపీ పరిధిలో వచ్చే చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ప్రాంతాలకు చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిగా నిర్ధారించారు. అదేవిధంగా గాంధీనగర్ లా అండ్ ఆర్డర్ ఏసీపీ డివిజన్ పరిధిలోకి వచ్చే గాంధీనగర్, దోమలగూడ పోలీస్ స్టేషన్ల ప్రాంతాలకు గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిగా నిర్ధారించారు. మార్పుల్లో భాగంగా నాంపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ స్థానంలో కొత్తగా గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. గత నెల రోజుల క్రితం నగర కమిషనర్ ఆదేశాల ప్రకారం ఈ మార్పులు జరగాయని చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం తెలిపారు.

అంతర్జాతీయ యోగా అవగాహన ర్యాలీ

కవాడిగూడ, జూన్ 18: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ యోగా సంస్థాన్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కులో అవగాహన నిర్వహించారు. యోగా గురువు బి.సరోజిని రామారావు నేతృత్వంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, జి.కృష్ణవేణి, జ్యోతిరాజా, శ్రీలత, హిత, పద్మజ, అనిత, రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి, సీనియర్ అడ్వకేట్ రాజేంద్రకుమార్, రాజానరసింహ, ఓం ప్రకాష్, వాకర్స్ అసోసియేసన్ సభ్యులు మంద శ్రీనివాస్, నరేంద్ర యోగా ప్రాముఖ్యతను వివరించే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా యోగా గురువు బి.రామారావు మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, వాకర్స్ పాల్గొన్నారు.

తిరుమలరావుకు పీహెచ్‌డీ ప్రదానం

అడ్డగుట్ట, జూన్ 18 మెట్టుగూడ ప్రాంతానికి చెందిన తిరుమల్‌రావుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఐఎన్‌డీఏఎస్ 16, ఐఎన్‌డీఏఎస్ 115 ఆర్థిక ప్రకటనలపై ప్రభావం–0 ఎంపిక చేసిన భారతీయ కంపెనీల అధ్యయనంపై పరిశోధనలను సీఎంఏ, కామర్స్‌ను ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన పూర్తి చేశారు. ప్రస్తుతం తిరుమలరావు భవన్స్ వివేకానంద కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కార్పొరేట్ లెక్కల నిర్వహణ, ఆర్థిక నివేదిక ప్రమాణాలకు ఈ పరిశోధన ప్రాముఖ్యత పొందిందని ఆయన తెలిపారు.

ఈ నెల 28న విశ్వకర్మ సంఘం ఎన్నికలు

20న నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ 21న

బేగంపేట్, జూన్ 18: సికింద్రాబాద్‌లోని పాట్ మార్కెట్ స్థానిక విశ్వకర్మ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు ప్రకటించారు. ఈ ఏడాది మే 10, జూన్ 14న జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించిన ప్రకారం ఎన్నికలు జరుపుతున్నట్లు బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలిపారు. క్రమ పద్ధతిలో జరిగే ఎన్నికల ప్రక్రియ ద్వారా పటిష్టమైన నాయకత్వం లభిస్తుందని, అలాంటి ఈ ఎన్నికల విషయాన్ని ప్రతి ఓటరు ఇతర అర్హత కలిగిన ఓటరుకు సమాచారం అందించాలని కోరారు. విధిగా ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. సభ్యత్వ రుసుము చెల్లించి రసీదు తీసుకోవాలని, రసీదును ఓటు వేసేటప్పుడు తమ వద్ద ఉంచుకోవాలని ప్రత్యేకంగా సూచించారు. జూన్ 20న నామినేషన్ల స్వీకరణ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాగా, ఉపసంహరణ 21న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అని ప్రకటించారు. జూన్ 28 ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లలితా సదన్ బవనంలో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రధాన అధికారిగా విజ్జమూరి రాఘవాచారి, పరిశీలకులుగా చేపూరి వెంకటస్వామి, ఇన్చార్జిగా రాగి ఫణి సతీష్‌కుమార్, కన్వీనర్‌గా కడియాల శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి పోటీలకు రెండేసి పదవులు నియమించగా, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ధర్మకంట చైర్మన్, భవనం చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ చైర్మన్, న్యాయశాఖ చైర్మన్ పోటీలకు చెరొక పదవి నియమించారు. రూ.100 కట్టి సభ్యత్వం తీసుకోవడానికి ఆఖరి తేదీ జూన్ 18 అని ప్రకటించారు.

బీఆర్ఎస్ నాయకుడు జైసింహకు సన్మానం

జైసింహను సన్మానిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా తదితరులు

చిక్కడపల్లి, జూన్ 18: అమెరికాలో నిర్వహించిన తెలంగాణ అవతరణ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. అమెరికాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, పార్టీ రజతోత్సవ పాల్గొని విజయవంతంగా స్వదేశానికి తిరిగి వచ్చిన జైసింహను సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, రవి శంకర్‌గుప్త, జీవై గిరి, జి.వెంకటేష్, పి.రాజ్‌కుమార్, విఠల్, హనుమంతు, ఎన్.శ్రీహరి, వెంకటేష్‌యాదవ్, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడిబావి, మైలార్‌గడ్డలో కార్పొరేటర్ పర్యటన

సికింద్రాబాద్, జూన్ 18: ప్రజల నుంచి తమకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. మేడిబావి, మైలార్‌గడ్డ ప్రాంతంలో ఆమె బుధవారం పర్యటించారు. మేడిబావి ప్రాంతంలో స్థానికుల ఫిర్యాదు మేరకు నూతన సీసీరోడ్డు ఏర్పాటు చేయాలని, రైల్వే ట్రాక్ పక్కన ఉన్న గృహాలకు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ రిటర్నింగ్ వాల్ అంశంపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లి నిర్మించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీసీరోడ్డు ప్రపోజల్స్ పెట్టమని అప్రూవల్ రాగానే సీసీరోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మైలార్‌గడ్డ బరోడా బ్యాంక్ ప్రక్క లేన్‌లో తాగునీరులో కలుషిత నీరు వస్తుందని కార్పొరేటర్ దృష్టికి సమస్య తీసుకురాగా అధికారులతో కలిసి పర్యటించారు. వాటర్ లైన్ లీకేజీ కారణంగా కలుషిత నీరు వస్తుందని గుర్తించారు. త్వరగా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్, నాయకులు అనిత, కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

'ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే ఉపేక్షించేది లేదు'

బొల్లారం, జూన్ 18: రోడ్డుకు ఇరువైపులా స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కంటోన్మెంట్ చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ హెచ్చరించారు. కొన్ని ఏండ్లుగా రోడ్డు కిరువైపులా స్థలం ఆక్రమించి వాహనదారులకు ఇబ్బందులు కలగజేస్తూ ఓ వ్యక్తి స్క్రాప్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ విషయమై కంటోన్మెంట్ బోర్డు దుకాణాన్ని తొలగించాలని నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో బుధవారం రంగంలోకి దిగిన కంటోన్మెంట్ బోర్డు ఇంజినీరింగ్ అధికారులు స్క్రాప్ దుకాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ ఆదేశాల మేరకు దుకాణాన్ని తొలగిస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంజినీర్ కృష్ణకాంత్‌రెడ్డి, అమిత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

'ప్రజా సంబంధాల కేసులను సత్వరమే పరిష్కరించాలి'

బొల్లారం, జూన్ 18: నేరాలను నియంత్రించి, ప్రజా సంబంధాల కేసులు సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని తిరుమలగిరి ఏసీపీ రమేష్ అన్నారు. బుధవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో తనిఖీ చేసి పోలీస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు నేర నివారణ, ప్రజా సంబంధాలు కేసుల సత్వర పరిష్కారంపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న ఎస్సై రాజశేఖర్ రెడ్డి, వెంకట్‌కుమార్, ప్రశాంత్‌ను సీఐ నాగరాజుతో కలిసి వీడ్కోలు పలికి సత్కరించారు. బదిలీపై వచ్చిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌రాజు, ఎస్సై కెన్ని ఫోర్డ్‌ను ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాటిగడ్డలో కార్డెన్ సర్చ్

బేగంపేట్, జూన్ 18: బేగంపేట్ పాటిగడ్డలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి బేగంపేట్ పాటిగడ్డ, రసూల్‌పుర ప్రాంతాల్లో అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఉత్తర మండలం డీసీపీ రశ్మీ పెరుమాల్, బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావులతో పాటు పోలీస్ సిబ్బంది అనువనువు తనిఖీలు చేసి అనుమానితులను ప్రశ్నించారు. పలువురి ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. మాజీ రౌడీషీటర్లతో పాటు పాత నేరస్తులైన 11 మంది అనుమానితులను ప్రశ్నించారు. వారి జీవనోపాది, చేస్తున్న పనులపై ఆరా తీశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నంబర్ ప్లేట్స్ లేని 70 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి ఇంట్లో 4 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల కోసం వినియోగించే రోలింగ్ పేపర్లను గుర్తించి నిల్వ చేసిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. కార్డెన్ సెర్చ్‌లో పోలీస్ అధికారులతో పాటు సుమారు 200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, జూన్ 18: పంచాయతీ కార్యదర్శుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం ఆధ్వర్యంలో నూతన పీఆర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్‌ను బుధవారం సెక్రటేరియట్‌లో కార్యాలయం సంఘం నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేస్తూ ఓపీఎస్‌గా నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి గ్రేడ్–4 నియమించాలని అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల యొక్క నాలుగు సంవత్సరాల విధినిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా పరిగణిస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫోరం రాష్ట్ర సెక్రటరీ పి.వెంకటరమణ, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గోదా రాజు, వేమారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలి'

చిక్కడపల్లి, జూన్ 18: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణహోమాన్ని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ 20 మాసాలకుపైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని అన్నారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ సామాన్య ప్రజలపై కాల్పులకు తెగబడుతూ యుద్ధనేరాలకు పాల్పడుతున్నదని తీవ్రంగా విమర్శించారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతోసహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారని ఆరోపించారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తున్నదని విమర్శించారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావీద్, జిల్లా నాయకులు అస్మిత, రాజయ్య, మహేష్, ప్రవీణ్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రోగాలు తగ్గిస్తామంటూ మాయ

బేగంపేట్, జూన్ 18: రోగాలు తగ్గిస్తామంటూ చెట్ల మందులు ఇచ్చి.. దోచుకుంటున్న అంతరాష్ట్ర ముఠాను బుధవారం రాంగోపాల్‌పేట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింగరావు వివరాల ప్రకారం కర్ణాటక బెగాల్కోట్‌కు చెందిన మంజు దుర్గప్ప, గోవింద్, కిరణ్ గోవిందప్ప, కేశవ్, రవిశెట్టి, సురేశ్ ముఠాగా ఏర్పడి నల్లకుంటలో సెంటర్‌ను ఏర్పాటు చేసి ఆయుర్వేద మందులు ఇస్తున్నారు. వృద్ధులు, మోకాళ్ల నొప్పులు ఉన్న వారిని టార్గెట్ చేస్తారు. ముఠాలోని సభ్యుడు ఆసుపత్రి వద్ద నిలబడి రోగులతో మాటలు కలిపి.. ఏమైందమ్మా.. ఆరా తీస్తారు. పలాన సెంటర్లో ఆయుర్వేద మందు ఇస్తే నెలలోగా తగ్గుతుందని నమ్మిస్తాడు. నమ్మి వచ్చినవారిని కేంద్రానికి తీసుకువెళ్లి ఏవో మందులు ఇస్తారు. ఇందుకు ఫీజుల రూపంలో లక్షలు తీసుకుంటున్నారు. ఇలా అనేక మంది రోగుల వద్ద డబ్బులు వసూల్ చేశారు. ఈ నెల 13న ఈ ముఠాలోని దుర్గప్ప.. కిమ్స్ ఆసుపత్రి వద్ద 65 ఏండ్ల వృద్ధురాలితో మాట్లాడుతుండగా ఆమెకు అనుమానం వచ్చి సెక్యూరిటీ సిబ్బందికి తెలిపింది. వారు వచ్చేలోగా దుర్గప్ప అక్కడి నుంచి పారిపోయాడు. తిరిగి బుధవారం ఉదయం కిమ్స్ ప్రాంగణానికి వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు దుర్గప్పను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నకిలీ వైద్యం గురించి ఒప్పుకున్నారు. దీంతో ముఠా సభ్యుల్లో నలుగురిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.